క్లుప్తంగా

16న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ను ఈ నెల 16వ తేదీన ఆంధ్ర లయోలా కాలేజీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఈఎస్- జె వ్యవస్థాపకుడు, డైరెక్టర్ బి.బాలకుమార్, మ్యాజిక్ యూత్ ప్రతినిధి హర్షిత తెలిపారు. వైఈఎస్- జె, మ్యాజిక్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను లయోలా కాలేజీలో శనివారం ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి వయోపరిమితి నిబంధన లేదన్నారు. విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు.

సృజనాత్మకత వెలికితీతకే లెడ్ కాన్ఫరెన్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి మెరుగులు దిద్దేందుకు లెడ్ కాన్ఫరెన్సు దోహదపడుతుందని నారాయణ పాఠశాల ఆర్ అండ్ డీ మరియా పాట్రిక్ అన్నారు. మారుతీ నగర్ నారాయణ పాఠశాలలో శనివారం లెడ్ కాన్ఫరెన్స్ జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కాన్ఫరెన్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాసంవత్సరంలో విద్యార్థులు సాధించిన విజయాలు, అభ్యాసం గురించి తల్లిదండ్రులకు తెలిపేందుకు లెడ్ కాన్ఫరెన్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల జిల్లా ఏజీఎం రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హుస్సేన్, కో-ఆర్డినేటర్ హెప్సిబా, వైస్ ప్రిన్సిపాల్ సునంద పాల్గొని విద్యార్థుల కృషి, అంకితభావాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడకల్చరల్: విప్ర వ్యాపార సాధికారిక సంస్థ, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న బిగ్ బిజినెస్ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో వేణు విద్వాంసుడు ఇంద్రకీలాద్రి శర్మ బృందం నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. చిన్నారులు పలు సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. అనంతరం కల్లూరి సూర్యనారాయణ మూర్తి బృందం పలు సంప్రదాయ కీర్తనలు ఆలపించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ శాసన సభ్యుడు మల్లాది విష్ణు మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బ్రాహ్మణ సంఘం నాయకులు జింకా చక్రధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు కాంస్యం



విజయవాడస్పోర్ట్స్: 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు కాంస్యపతకం సాధించింది. మంగళగిరిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలు శనివారం ముగిశాయి. లీగ్ దశ నుంచి అద్భుతంగా రాణించిన ఎన్టీఆర్ జిల్లా జట్టు శుక్రవారం సెమీస్‌కు చేరింది. మూడో స్థానం కోసం శనివారం జరిగిన పోటీలో 1-0 తేడాతో గుంటూరు జిల్లా జట్టును ఓడించి ట్రోఫీ సాధించింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.జాన్సన్, ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ప్రతినిధులు జి.హర్షవర్ధన్, పి.థామస్, సూర్యప్రకాష్ చేతుల మీదుగా ఎన్టీఆర్ జిల్లా జట్టు ట్రోఫీ అందుకుంది.

దాసాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రెండో శనివారం సెలవు దినం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఈఓ పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

తుదిదశకు చేరిన మురుగుకాలువ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో జరుగుతున్న మురుగుకాలువ పనులు తుది దశకు చేరుకున్నాయి. పందిరి రోడ్డులో మురుగుకాలువ మురుగును బుడమేరులోకి తరలించేందుకు అవసరమైన పైపులైన్‌లు వేశారు. శనివారం పైపులైన్, మురుగుకాలువ పనులను కార్పొరేషన్ ఏఈ నాగరాజు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మహిళాభ్యుదయంలో

జగనన్న పాలన ఓ సువర్ణాధ్యాయం

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళాభ్యుదయంలో జగనన్న పాలన ఓ సువర్ణాధ్యాయమని వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విజయవాడ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మల్లాది విష్ణు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ఆడపడుచుల అభ్యున్నతి, సాధికారతకు పెద్దపీట వేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ పాలన సాగించారని గుర్తు చేశారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో వైఎస్ జగన్ ఎక్కడా రాజీ పడలేదన్నారు. అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించారన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం తీసుకువచ్చారన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల కాలంలో ఆడపడుచులపై దాడులు పెచ్చుమీరాయని మల్లాది విష్ణు ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలులోనూ ఈ ప్రభుత్వం వంచన చేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆడపడుచులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ జగన్ మహిళలను అన్ని విధాలా ప్రోత్సహించారన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజా రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలిస్తే కూటమి ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం మహిళా దినోత్సవ కేక్ కట్ చేసి, పలు రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోపుల వరలక్ష్మి, కార్పొరేటర్లు అలంపూర్ విజయలక్ష్మి, ఎండీ షాహినా సుల్తానా, ఇసరపు దేవి, యరగొర్ల తిరుపతమ్మ, కొండాయగుంట మల్లేశ్వరి, కుక్కల అనిత, ఉద్దంటి సునీత తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మూలం మహిళ

మానవ మనుగడకు, ఈ సృష్టి నడవడికకు మూలం మహిళే అని, నిర్విరామంగా శ్రమించే మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పలువురు వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఇంద్రకీలాద్రి యూనిట్ ఆధ్వర్యంలో వాంబే కాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమ సేవా సంస్థలో శనివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ పెద్దలు పాల్గొని ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ప్రాధాన్యతను ఇచ్చి వారిని గౌరవించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అసోసియేషన్ నాయకులు ఎస్.రామారావు, ఎం.హనుమంతరావు, ఏఎల్ నరసింహారావు, మాతృదేవోభవ వృద్ధాశ్రమ నిర్వాహకులు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం మాతృదేవోభవ వృద్ధుల సేవాసంస్థ నిర్వాహకురాలు ఎం.దుర్గను డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోరంగి నాగమల్లీ శ్వరి తదితరులు పాల్గొన్నారు.

30వ డివిజన్ శానిటరీ కార్యాలయంలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు అనిర్వచనీయమని, అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బి.జానారెడ్డి సూచించారు. స్థానిక 30వ డివిజన్ శానిటరీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పారిశుద్ధ్య మహిళా కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, మేస్త్రి శ్రీనివాస రావు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేయూతలో మహిళా దినోత్సవం

చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి మాట్లాడుతూ పురుషులకు దీటుగా అన్ని రంగాలలో మహిళలు ప్రగతి సాధించటం శుభ పరిణామం అని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ప్రత్యేక చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ మహిళల ముందంజ

విజయవాడస్పోర్ట్స్: నేటి సమాజంలో అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న మహిళలు క్రీడల్లోనూ ముందంజలో ఉన్నారని కార్పొరేటర్ వీరమాచినేని లలిత కిషోర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక సత్యనారాయణపురం జీవీఎస్ శాస్త్రి పార్కులోని స్కేటింగ్ రింక్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్ లో మహిళలు అనేక మెడల్స్ సాధించారని గుర్తు చేశారు. రోలర్ స్కేటింగ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారిణులు మెడల్స్ సాధించటం అభినందనీయం అన్నారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ,రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన విజయవాడ స్కేటర్లు ఆర్యాని, సుచిత్ర,, నిహారిక, శాన్వి రఫియా, లేహస్య , దీక్ష, షష్మిన్ రఫియా, ఆశ్రిత, మహాలక్ష్మి, ప్రతుల్య, మధురిమలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు వరుణ్ కృష్ణ, దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు సుధాస్వామి మహిళలను సత్కరించి వారికి జ్ఞాపికలు అందజేశారు.

ఏపీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.జార్జ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. శాలువాలతో మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా విభాగం ప్రెసిడెంట్ డాక్టర్ జి. శాంతకుమారి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రాజ్యలక్ష్మి, శ్రీసాయి దుర్గా డయాగ్నస్టిక్ అధినేత ఎస్.దివ్య, సమాచార శాఖ సెక్రటరీ డాక్టర్ పి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో...

శ్రీ గురు విశ్వస్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ సవ్యసాచి అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు ప్రమీల, భాగవతుల హేమలత, ఠాగూర్ గ్రంథాలయాధికారి కె.రమాదేవి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళలు అన్ని రంగాలలో ముందంజలో వుండాలని అమృత హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, అధ్యక్షురాలు ధారా కరుణశ్రీ అన్నారు. శనివారం పాయకాపురంలో స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు 202 గవర్నరు ఎ.విజయలక్ష్మి, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకురాలు పి.భారతి మాట్లాడారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన 9 మంది మహిళలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్పందన సేవా సమితి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డి.మురళి, డాక్టర్ నాగమల్లిక, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, కమిటీ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు



డీసీపీ(అడ్మిన్) కేజీవీ సరితను శాలువా, పూల మొక్కతో సత్కరిస్తున్న గోకర్ణేశ్వరరావు

భారతీయ విద్యామందిర్‌లో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీనగర్ కాలనీ భారతీయ విద్యామందిర్‌లో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గా భవాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం మహిళలకు కల్పించిన హక్కులు, చట్టాల గురించి అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ వి.స్వప్న విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శి నాగదుర్గా భవాని, హెల్త్ సెక్రటరీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ సరితకు సత్కారం

ఏలూరు రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా డీసీపీ(అడ్మిన్) కేజీవీ సరితను శాలువా, పూల మొక్కతో సత్కరించారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సేవలను సద్వినియోగం చేసుకుని స్వయం స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక దుర్గాపురం చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నవనీతం సాంబశివరావు, రమణమ్మ, ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళలకు సముచిత స్థానం

పాయకాపురం(విజయవాడరూరల్): భారతీయ సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించి వారి స్థాయిని, గౌరవాన్ని పెంచడంలో భారతీయులు ముందుంటారని క్యోఇకు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బల్లం కిషోర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ అకాడమీలో కరాటే నేర్చుకుంటున్న బాలికల తల్లులను ఘనంగా సన్మానించారు. అనంతరం బాలికలు కరాటే ప్రదర్శన చేశారు.

ఐద్వా ఆధ్వర్యంలో మహిళల ర్యాలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ నగరంలో ఐద్వా, శ్రామిక మహిళా సంఘం (సి.ఐ.టి.యు), యూటీఎఫ్ ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన, బహిరంగసభ జరిగాయి. పాతబస్టాండ్ నుంచి లెనిన్ సెంటర్ వరకు మహిళలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం లెనిన్ సెంటర్‌లో సభ నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, శ్రామిక మహిళా కన్వీనర్ ఎ.కమల అధ్యక్షతన జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సి.ఐ.టి.యు ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు సుబ్బరావమ్మ, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, యూటీఎఫ్ జిల్లా నాయకురాలు లీల తదితరులు పాల్గొన్నారు.



పలు రంగాల్లో సత్తా చాటిన మహిళలను సత్కరించిన మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

మహిళా సాధికారతకు వైఎస్ జగన్ కృషి

- రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అత్యధిక ప్రాధాన్యం
- నేడు రాష్ట్రంలో ఏమి జరుగుతుందో అందరికీ తెలుసు
- మహిళా దినోత్సవంలో మేయర్, డెప్యూటీ మేయర్‌లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతులుగా ఎదిగేందుకు గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా గత ప్రభుత్వం పనిచేస్తే, నేడు రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఎలా ఉందో అందరూ చూస్తున్నారని ఆమె అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం గుణదలలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజరెడ్డి, ఇతర మహిళా కార్పొరేటర్‌లతో కలిసి కేక్ కట్ చేశారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలందరూ ఎంతో ఆనందంగా ఉన్నారని, అన్ని రంగాల్లో ముందుకెళ్లారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేశారన్నారు. మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారని, రాజకీయాల్లో 50 శాతం పదవులు మహిళలకే ఇచ్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో మహిళలను భాగస్వాములను చేశారన్నారు. డెప్యూటీ మేయర్‌లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజరెడ్డి మాట్లాడుతూ నేడు కూటమి ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను గెలిపించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు విజిత, రాష్ట్ర జనరల్ సెక్రటరీ స్వప్న, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, రెహానా నాహిద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాలు శ్రావణి, జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన ఎం.సుచిత్ర, హాసిక, జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలు ఇచ్చిన ఎం.ప్రణీతిలను శాలువాలతో సత్కరించారు.



రామకృష్ణాపురంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



లెనిన్ సెంటర్ బాబా మందిరంలో మహిళలను సత్కరించిన దృశ్యం



మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు



లెనిన్ సెంటర్ లో ఐద్వా ఆధ్వర్యంలో ప్రదర్శన



మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా



కరాటే బాలికల తల్లులకు సన్మానం

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఎటువంటి ఆంక్షలు లేకుండా విజయవాడను ఫ్రీ జోన్ చేయాలి
- నగర పరిసర మండలాల ఆటోలను నగరంలోకి ట్రాన్స్‌ఫర్ చేయాలి
- ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం డిమాండ్



మాట్లాడుతున్న దాది శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఆటో కార్మికుల జీవనాన్ని దెబ్బతీసే విధానాలు అవలంబిస్తోందని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం(ఇఫ్టూ) నగర అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు అన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే ఆర్థిక పరిస్థితి బాగోలేదని కూటమి ప్రభుత్వం చెబుతోందని, హామీలు ఇచ్చేటప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా అని నిలదీశారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2002వ సంవత్సరం నుంచి నేటి వరకు ఆటో కార్మికులను టీడీపీ ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిందన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆటో కార్మికుల జీవనోపాధికి విఘాతం కలిగిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో జీవో 21 తెచ్చినప్పటికీ తమను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయలేదని గుర్తు చేశారు. ఏడాది తిరగక ముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. జీవో 8ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా నగరాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలన్నారు. విజయవాడ పరిసర మండలాల ఆటోలకు నగరంలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమం చేపడతామన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కార్యదర్శి సీహెచ్ పెద్దిరాజు, జిల్లా అధ్యక్షుడు ముని శంకర్, ఆటో కన్సల్టింగ్ ప్రతినిధులు పి.రాజా, పి.రాంబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, ఇఫ్టూ నాయకులు శ్రీధర్ బాబు, రఫీ, ఆర్.శ్రీనివాసరావు, యాదగిరి, వలీ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా పార్టీ నేతలే మోసం చేశారు!

కలికిరి మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు చెలిమి అస్లామ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్ట్ ఇప్పిస్తామని సొంత పార్టీ నేతలే తనను మోసం చేశారంటూ అన్నమయ్య జిల్లా కలికిరి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చెలిమి అస్లాం ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ నేతలు తనకు చేసిన అన్యాయంపై ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కలికిరి మండలం జనసేన పార్టీ నాయకులు దారం హరి, అనిత అదానీ కంపెనీ స్మార్ట్‌మీటర్ల కాంట్రాక్ట్ ఇప్పిస్తామని చెబితే నమ్మి రూ.6.50 లక్షలు ఇచ్చానని, తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయాడు. డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని అస్లామ్ కోరారు.

బాకీ చెల్లించాలని బెదిరించిన వ్యక్తిపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): బాకీ డబ్బులు చెల్లించాలంటూ కొంతమంది వ్యక్తులతో వచ్చి బూతులు తిట్టి, భయభ్రాంతులకు గురి చేసిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నున్న గ్రామానికి చెందిన గుంటక శ్రీనివాసరెడ్డి పౌల్ట్రీ పరిశ్రమ నిర్వహణ నిమిత్తం విజయవాడకు చెందిన పోలంకి రెడ్డి దగ్గర డబ్బులు అప్పు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో బాకీ డబ్బులు చెల్లించమని ఈ నెల 6న నున్న గ్రామంలో శ్రీనివాసరెడ్డి ఇంటికి పోలంకి రెడ్డి కొంతమందిని తీసుకొచ్చి బూతులు తిట్టి, భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాది శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

కాటికాపరుల సమస్యలపై ధర్నాను విజయవంతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్మశానంలో పనిచేసే కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన ధర్నా చౌక్‌లో తలపెట్టిన మహాధర్నాకు వందలాదిగా తరలిరావాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. సింగ్‌నగర్ వాంబే కాలనీలో ఉన్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికలను కేవీపీఎస్ నాయకులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. అక్కడ పనిచేస్తున్న కాటికాపరుల కుటుంబాలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానాల్లో పని చేస్తున్న వారందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, వారిని 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. వయసు నిండిన వారందరికీ రూ.8000 పెన్షన్ ఇవ్వాలని.. వృత్తి పరికరాలైన గడ్డపార, రెండు చెలికలు, రెండు గంపలు, గ్లౌజ్, బూట్లు, డ్రస్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరికి ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు పీరు సాహెబ్, పి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రగతి దేశ సౌభాగ్యానికి సోపానం



వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: మహిళా ప్రగతి దేశ సౌభాగ్యానికి సోపానమని శ్రీదేవి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి అన్నారు. అయోధ్యనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం మహిళాదినోత్సవం సందర్భంగా పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన బి.సుజన, కె.ప్రవీణ, డాక్టర్ రమ్య, స్రవంతి రాయ్ తదితరులు పాల్గొన్నారు. మహిళ‌లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో...

తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై శనివారం మహిళా దినోత్సవం, సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన మహిళలకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. వర్ల అరుణకుమారి, డాక్టర్ జమ్మి శారద, మల్లాది కార్తీక త్రివేణి, భారతి, సుహాసిని, మల్లేశ్వరి, సునీత, సీతామహాలక్ష్మి తదితరులను ఘనంగా సత్కరించారు. గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.